# అదృష్టవంతుడు

"బావగారూ! రండి, బహుకాలదర్శనం!"

"......"

"మీకు నాలుగైదు ఉత్తరాలు రాశాను. మీ దగ్గర నుంచి ఎలాంటి జవాబూ లేదు."

"......"

"అమ్మాయి పుట్టింటికి వచ్చి అప్పుడే రెండేళ్ళైంది. మీకు నేడు కాకపోతే రేపైనా దయ కలగదా అని ఇంతకాలం ఎదురుచూశాను."

"......"

"చూడండి, మా వల్ల ఏదైనా తప్పిదం అయితే అందుకు మీ కోడల్ని శిక్షించడం అన్యాయం. అది అభం శుభం తెలియని పిల్ల. జీవితంలో మాధుర్యం రుచి చూడవలసిన ఈడులో అది కుమిలిపోతూంటే తల్లిదండ్రులం ఎంతగా బాధపడి ఉంటామో మీకు తెలియనిది కాదు."

"......"

"పిల్ల పెళ్ళిలో నా తాహతుకి మించి అయినా పాతికవేలు కట్నం ఇచ్చాను?"

"......"

"ఎవరికోసం ఇస్తారు? మరి కొంతకాలం వేచి ఉంటే మావాడి ధర ఇంకా పెరుగుతుంది. నేను కాబట్టి పరంధామయ్య కూతుర్ని ఇంతతక్కువ కట్నంతో చేసుకుంటున్నాను" అని నలుగురితోనూ అన్నారు. మీ దయాహృదయానికి కరిగిపోయాను."

"......"

"కానుకలకూ ఏ లోపం కలిగించలేదు. అడిగినవన్నీ సమకూర్చాను. మీకు తెలియంది కాదు."

"......"

"అలకపానుపుమీద అల్లుడుగారు రేడియో కావాలన్నారు. అప్పటికప్పుడు అదీ కొని ఇచ్చాను."

"......"

'నిజమే, మీరన్నట్లు అమ్మాయి సుఖం కావాలంటే ఇవి ఈనాడు పరిపాటి అయిపోయాయి. కాదని నేనెలా అనగలను?"

"......"

"అమ్మాయిని పంపేటప్పుడు సారెగా బీరువా, పందిరిమంచం విధిగా ఇవ్వాలని ఉత్తరం రాశారు. ఇవన్నీ ఇవ్వడం నాకు సాధ్యపడుతుందా అని ఆలోచించి ఉండరు. నిజమే వీటిని ఉపయోగించేది మా అమ్మాయే. మీ రంత స్పష్టంగా రాస్తే నేను మాత్రం ఎలా కాదనగలను? అందుకే ప్రావిడెంటు ఫండులో ఉన్నదంతా తీసి ఆపైన కాబూలీ అప్పుచేసి మీరు కోరినవన్నీ ఇచ్చాను."

"......"

"ప్రతిపండుగకూ అల్లుడుగారికి అతను కోరిన మేరకు అతనికి నచ్చిన బట్టా, పాతా కొని పెట్టాను - నా శక్తికి మించి అయినా."

"......"

"ఒరేయ్ పరంధామం, నీకు మతి ఉందా? నీవు చేస్తున్నది బడిపంతులు ఉద్యోగమని మరిచిపోకు. ఇలా ఉన్నదంతా ఆ కూతురికే పెడితే మిగతా పిల్లల గతేంకాను? అని నా మిత్రులు వారించినా వారి మాటలను లక్ష్యపెట్టలేదు. ఎందుకని? మీ ఆగ్రహానికి అది బలి అవకూడదనే. దాని బ్రతుకు బూడిద కాకూడదనే. వాళ్ళన్నట్లు నేను తాహతుకి మించిన పరుగులే పెట్టాను. ఏం చేస్తాను? ఆడపిల్లను కన్న తరువాత ఇలాంటి పాట్లు తప్పవు?"

"......"

"నేను పడుతున్న అవస్థలు నా కన్నకూతురు అర్థంచేసుకుంది. కాని ప్రయోజనం ఏముంది? మీకు మాత్రం తృప్తికలగలేదు. 'పుట్టింటినుంచి అది తెప్పించు, ఇది తెప్పించు' అని మీరు మీ కోడల్ని వేధించసాగారు. అది ప్రతిఘటిస్తే దాన్ని మీ దారిలోకి ఎలా తేవాలో అది మీకు వెన్నతోపెట్టిన విద్య. ఇదే మా ఆఖరి కోరిక. ఇకముందు మరేం అడగం అని ఆమెను సమాధానపరిచేవారట. నిజమే కాబోలు అని ఆమె ప్రతిమారూ మనస్ఫూర్తిగా నమ్మేది. మేమూ నిజమే కాబోలునని అనుకున్నాం.

"......"

"మీ అబ్బాయి పెళ్ళి అయి మూడేళ్ళు అయింది. ఇంకా అత్తవారిమీద ఆధారపడడం ఏమిటన్న ఆలోచన మీకు తట్టలేదు. ఇది వట్టిపోయిన గొడ్డు. పాలు కాదు కదా, చీమూ నెత్తురూ కూడా లేకుండా ఎండిపోయింది అని మీరు ఆలోచించలేదు. నెత్తురు తాగడానికే

అలవాటుపడ్డారు. మావల్ల ఆలస్యం జరిగితే మా కూతురుపడే బాధలు ఎలా ఉంటాయో మీరు ఆమెకి మచ్చు చూపేవారు. అది బాధపడితే క్షేమం చూడలేం. ఆ సంగతి మీకు బాగా తెలుసు. కాని మీకు తృప్తి అనేది ఏ కోశానా లేదని ఋజువు చేశారు."

"......"

"నన్నో కల్పవృక్షంగా భావించారు. కలర్ టి.వి. కావాలన్నారు. మామూలు టి.వి.యే నాలుగువేలు చేస్తుంది. పదివేలు నేను ఎక్కడ నుంచి తేగలను- అని మీరు తలచలేదు. ఆ విషయమే మీకు తెలియజేస్తూ నన్ను క్షమించమని ప్రాధేయపడ్డాను. ఆ ఉత్తరానికి మీరు జవాబు రాయలేదు. అయితే ఏదీ మనసులో దాచుకునే అలవాటులేదు. మా అమ్మాయిచేత జవాబు రాయించారు. మీ అబ్బాయి పెద్ద చదువులు చదివాడు. నెలకు రెండువేలు జీతం. సంఘంలో పేరుప్రతిష్ఠలున్నాయి. అందువల్ల ఇలాంటి చిన్న చిన్న కోరికలు తీర్చాలి. బాగా సెలవిచ్చారు. ఆ విషయం గుర్తించకపోవడం నాదే పొరపాటు."

"......"

"నా అసమర్థతమూలంగానే నేను టి.వి. కొని పంపలేకపోయాను. మీరు ముందుగా 'హెచ్చరించినట్లు మీ కోడల్ని కట్టుబట్టలతో పుట్టింటికి తగిలేశారు. నేరం ఒకరిదీ, శిక్ష వేరొకరికా? మీ అమ్మాయిపట్ల ఆమె అత్తింటివారు అలా ప్రవర్తిస్తే మీరెలా ఫీలయ్యేవారు? మీరు అదృష్టవంతులు. ఆడపిల్లలు లేరు. అప్పుడు నేను మీ కాళ్ళూ చేతులూ పట్టుకొని బ్రతిమాలేను."

"....."

"మీరు కరగలేదు. అది తెగించి మీ ఇంటికి వస్తే గుమ్మంలోంచే వెళ్ళగొట్టారు. నీ తలదన్నేది మరో పిల ఏభైవేల కట్నంతో వస్తుంది. నీతో కాపురంచేసే దౌర్భాగ్యం మా వాడికి లేదన్నారు."

"......"

"అప్పటికీ అది మొండికేసి 'ఇది నా ఇల్లు, నే నిక్కడే ఉంటాను' అంది. నీకు చావాలని అంత మోజుగా ఉంటే అలాగే ఉండు. ఇప్పుడు కిరసనాయిల్ మీద కంట్రోలు కూడా లేదన్నారు. పాపం వెర్రిబాగుల్ది. మీరు అన్నంత పనిచేయగల సమర్థులని తెలిసి భయపడి పారిపోయి వచ్చింది."

"......"

"నామీద కనికరించి దాని కాపురం నిలపండి అని ప్రాధేయపడ్డాను. నా ఏడుపు అరణ్యరోదనే అయింది."

"......"

"నేను ఎంతగా బ్రతిమలాడినా మీ కరకుగుండె కరగలేదు. ఆఖరికి మీ కాళ్ళు పట్టుకున్నాను, అమ్మాయి దుఃఖం నాకు భరించశక్యం కాలేదు."

"......"

"మీరు ఆడినమాట తప్పనివారు. ఒక నిర్ణయానికి వచ్చిన తరువాత మీరు మరో విధంగా తలచరు. ఇలా రాక్షసంగా ప్రవర్తించడం మీలాంటివారికి శోభనీయదు. అయితేనేం మనిషి రక్తాన్ని మరిగిన పులికీ, మీకూ భేదంలేదు."

"......"

" 'ఏమిటి శోభనీయదో, ఏమిటి శోభనిస్తుందో అతను నాకు చెప్పాలా? ఆడపిల్లను కనగానే సరికాదు. ఆమె అచ్చట్లూ, ముచ్చట్లూ చూడాలి. మేం లోకవిరుద్ధంగా అడిగామా? వాళ్లు లోకవిరుద్ధంగా ఇస్తున్నారా? సమాజం ప్రతిపాదించిన నియమాలను పాటించాలి. ముష్టి, పదివేల రూపాయలకు ముఖం చూసుకున్నారు. కాని, అమ్మాయి బాగు ఆలోచించలేదు'-అంటూ తగు మనుషులతో మీరు అన్నారు."

"......"

" 'అమ్మమ్మ - పరంధామయ్య అలాంటివాడు కాదు. ఇంతకాలం మీ ప్రతి కోరికా తీరుస్తూ వచ్చాడే. నిజంగానే అతని చితికిపోయాడు. లేకుంటే టి.వి.కొనివ్వడా? మీకింతవరకూ ఇస్తూ వస్తున్న డబ్బుతో అతని కూతురు పోస్టుగ్రాడ్యుయేట్ అయి ఉండేది. అతను ఒక ఇల్లు కట్టుకుని ఉండేవాడు. మొగుడున్నా ఒంటరి జీవితం అనుభవిస్తున్న కూతురి సుఖంకోసం మీ ప్రతి కోరికా తీర్చాడు. మీరు ఇంకా హింసించడం న్యాయంకాదు' -అని వాళ్ళు చెప్తే తూలనాడి పంపారు."

"బావగారూ, మీది పాషాణ హృదయం. అది ఎంత మాత్రం కరగదు అని నాకు తెలుసు. అలాంటిది ఈనాడు పరంధామయ్య ఇల్లు వెతుక్కుంటూ మీరు వచ్చారంటే మీ ఉద్దేశం నేను అర్థం చేసుకోగలను."

"......"

"ఉండండి. మీరు చెప్పవలసిన పనిలేదు. విధిలీలలు ఒక్కొక్కప్పుడు విచిత్రంగానే ఉంటాయి."

"......"

"బడిపంతులు కొడుకు పెద్ద పరీక్షలు రాసి పెద్ద ఉద్యోగస్థుడౌతాడని మీరే కాదు నేనూ ఊహించలేదు. అయితే ఆ ఉద్యోగం మీ అబ్బాయి చేస్తున్న డిపార్టుమెంటులోనే ఔతుందని

మీరు కలలో కూడా తలచలేదు."

"......"

"వాడెక్కడ పనిచేసినా ఏం పనిచేసినా మీకు ఒరిగేదీ లేదు, మీకు నష్టమూ కాదు. కాని ఈనాడు వాడు ఏకు మేకౌతాడని మీరు ఊహించలేదు."

"......"

"మీ అబ్బాయిని సస్పెండుచేసే అవకాశం వాడికొచ్చిందట. నాన్నా బావగారు ఒక కేసులో ఇరుక్కున్నారు. సస్పెండు చేస్తున్నాను అంటూ నాకు టెలిగ్రామ్ ఇచ్చాడు."

"......"

"అప్పటికీ నేను వారించాను. 'ముల్లుమీద అరిటాకు పడినా, అరిటాకుమీద ముల్లుపడినా అరిటాకుకే నష్టంరా' అన్నాను. వాడు వింటాడా? 'దీంతో వాళ్ళ తిక్కే కుదురుతుంది' అన్నాడు. ఏం చెప్పను? తరాల అంతరం. వాడిది పాలపొంగు లాంటి వయసు. నాలా ముందూ వెనుకా ఆలోచించే జ్ఞానంలేదు."

"......"

"అయ్యో ఎంత పనిచేస్తున్నారు మీరు? నా కాళ్ళుపట్టుకోవడం భావ్యంకాదు. మీరెంత? మీ వంశం ఎంత? మీ ముందు నేను అల్పుడిని."

"......"

"ఏంచేస్తాం? ఎవరి కర్మానికి వాళ్ళే కర్తలు. వాడుచేసింది తప్పే. ఒప్పుకుంటాను. మీ అబ్బాయి గడ్డి కరిచాడే అనుకోండి. అంత మాత్రాన అతన్ని సస్పెండ్ చేయాలనుకోవడం మీ దృష్టిలో అన్యాయమే. కాని నా చేతిలో ఏముంది? అది వాడి విధ్యుక్తధర్మమట. బోడి అట. ఇంకేదో అట."

"......"

"ఏమన్నారు? నేను బోధపరిస్తే వాడు వింటాడంటారా? ఏమిటో నాలో ఆ శక్తి ఉందనుకోను. ఇంతకాలం మిమ్మల్ని ప్రాధేయపడ్డాను. కాళ్ళుపట్టుకున్నాను. అర్థించాను. అర్థమయ్యేటట్లు చెప్పాను. సాధించగలిగానా?"

"......"

"నిజమే. నా అల్లుడి ఉద్యోగం పోతే అది నాకు చిన్నతనమే. అవస్థలు పడేది నా కూతురే ఏం చేస్తాం? దాని నుదుట అంతే రాసిపెట్టి ఉంది."

"......"

"అబ్బే. నేను మీమీద పగతీర్చుకోవాలని అనుకోవడంలేదు. మంచివారే, అమ్మాయిని

తక్షణం మీ వెంట తీసుకెళ్తారా? మీకు పుత్రభిక్ష నేను పెట్టాలా? మీ వాడి ఉద్యోగం నేను కాపాడాలా? నేను మీమీద కరుణ చూపాలా?"

"......"

"ఏమిటో మీతో సంబంధం కలుపుకున్న తరువాత కరుణ, జాలి, దయ, మంచితనం వీటి అర్థాలే మరిచిపోయాను. ఏమైనా మీరు మా అమ్మాయిపట్ల క్రూరంగా ప్రవర్తించినందుకు ఇప్పుడు బాధపడుతున్నారని తెలిసిందిలెండి."

"......"

"చచ్చిన వాళ్ళను ఇంకా చంపాలని నేననుకోవడంలేదు. చెట్టంత మనిషి మీరు ఇలా నా కాళ్ళు పట్టుకు బ్రతిమాలుతూ ఉంటే నాకు చచ్చినట్లు ఉంది."

◆ ◆ ◆

ఒక మగపిల్లవాడి తండ్రి ఆడపిల్ల తండ్రి కాళ్లు తడిసిపోయేలా విలపిస్తున్నాడు.

ఈ కథకు ముగింపు ఎలా ఉంటుందో ఊహించడం కష్టం కాదు. మీరు ఊహించగలరన్న నమ్మకం నాకుంది. అందుకే ముందు కథ రాయడంలేదు.

అయితే ఒక్క ప్రశ్న.

ఆ మేరకు ఆడపిల్ల తండ్రి పరంధామయ్య అదృష్టవంతుడు. అతని కొడుకు ఆఫీసరయ్యాడు. అలాంటి అదృష్టం అందరికీ ఉంటుందా?

అలాంటి అదృష్టానికి నోచుకోని ఆడపిల్లల తండ్రులు ఈ దేశంలో కోకొల్లలుగా ఉన్నారు. మరి వాళ్ళ కథలకు అంతం ఏమిటి?.

– ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక 8.07.87